కమ్యూనిస్టులు ఏకమైతే అధికారం అసాధ్యమేమి కాదు

దశ, హైదరాబాద్: కమ్యూనిస్టులంతా ఏకమైతే అధికారం చేపట్టడం అసాధ్యమేమి కాదని, ఇందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి వామపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ శత వసంతాల ప్రస్థానం సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో కవి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ రచించిన " చలో ఖమ్మం" ఆరు గీతాలతో కూడిన సిడిని పల్లా వెంకట రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ లో బుధవారం అరసం కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప రెడ్డి, ఉజ్జని రత్నాకర్ రావు, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రముఖ సినీ దర్శకులు బాజ్జీ, పాటల రచయిత గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లీ ఉల్లా ఖాద్రీ, అరసం రాష్ట్ర అధ్యక్షులు రాపోలు సుదర్శన్, ప్రజానాట్య మండలి నాయకులు పి. వెంకటచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ నాడు జరిగిన స్వాతంత్ర సంగ్రామంలో సిపిఐ, ప్రజా సంఘాలు సముచిత స్థానాన్ని పోషించారని పేర్కొన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న నినాదంతో మొక్కవోని దీక్షతో ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశ అభివృద్ధిలో ప్రజల ఆర్థిక స్వావలంభన కోసం సంక్షేమ పథకాల అమల్లో కూడా పార్టీ క్రీయాశీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ ఉద్యమ చరిత్రతో గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ పాటలను రచించడం అభినందనీయమన్నారు. కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ అక్షర జ్ఞానం లేని ప్రజల్లో తమ పాటలు, రచనల ద్వారా చైతన్యం నింపిన ఘన చరిత్ర ఇప్టా, ప్రజానాట్య మండలిదేనని అన్నారు.

ఈ దేశంలో సినీ రంగం వెల్లుగోందదానికి ఇప్టానే కారణమని ఆయన తెలిపారు. కవులు కళాకారులు తమ పాటలు, రచనల ద్వారా ప్రజలను మరింత చైతన్యపర్చేవిధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బాజ్జీ మాట్లాడుతూ కొంత మంది దోపిడీదారులకు, పెట్టుబడిదారులకు నిలయమైన సినీ రంగంలో నిలదొక్కుకుని మొక్కవోని దీక్షతో తనకు పోరాటం చేసే శక్తిని ఇచ్చింది ప్రజానాట్యమండలేనని అన్నారు. కార్యక్రమంలో గాయకులు డాక్టర్ సూర్యప్రకాశ్, ఆరెల్లి రవి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని గుర్తుచేస్తోంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దశ, హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సంక్రాంతి పండుగవేళ పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు.

జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

బేగంబజార్‌లో నైట్ కైట్ ఫెస్టివల్

దశ, హైదరాబాద్: బేగంబజార్‌లో నైట్ కైట్ ఫెస్టివల్ జరుగుతోంది. భవనాలపై నుంచి కైట్లు ఎగరవేస్తూ యువత కేరింతలు కొడుతోంది. ఈ నైట్ కైట్ ఫెస్టివల్‌లో బేగం బజార్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత వందేళ్లుగా ఈ బేగం బజార్ వేదికగా నైట్ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇంత ఘన కీర్తి కలిగినఈ ఫెస్టివల్‌లో వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న పెద్ద అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏటా సంక్రాంతి వేళ.. రెండు రోజుల పాటు ఈ ప్రాంత వాసులు ఈ నైట్ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో ఆకాశంలో కైట్లు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. ఈ నైట్ కైట్ ఫెస్టివల్ కోసం ఈ ప్రాంతంలోని

పలు భారీ భవనాలపై ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ వెలుగుల్లో నైట్ కైట్ ఫెస్టివల్ జరుగుతోంది. మరోవైపు బేగంబజారులో డీజేల హోరెత్తుతోంది. ఈ మోతతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. నైట్ కైట్ ఫెస్టివల్‌లో ఉత్సాహంగా బేగం బజార్ వాసులు పాల్గొంటున్నారు. ఇక సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం నగర వాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తెలంగాణ పర్యాటక శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ఈ గ్రాండ్ ఈవెంట్‌కు దాదాపు 19 దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ హాజరయ్యారు. ఈ దేశంలోని వివిధ నగరాలకు చెందిన దాదాపు 50 మంది నేషనల్ కైట్ ఫ్లయర్స్, జంట నగరాలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన యువత సైతం భారీగా ఈ కైట్లు ఎగురవేసే కార్యక్రమానికి హాజరైంది.

యూపీపై ఢిల్లీ గెలుపు

మహిళల ప్రిమియర్ లీగ్‌లో దిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లిజెలీ లీ, షెఫాలి.. చెలరేగిన వేళ బుధవారం యూపీ వారియర్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. రెండేసి మ్యాచ్‌లు ఓడి.. తొలి విజయం కోసం పోరాడిన ఈ జట్ల మధ్య పోరులో దిల్లీ మొదట బంతితో.. తర్వాత బ్యాటుతో రాణించింది. మరిజేన్ కాప్ (2/24), షెఫాలి వర్మ (2/16) విజృంభించడంతో తొలుత యూపీని 154/8కు పరిమితం చేసిన దిల్లీ.. సరిగ్గా 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. లిజెలీ లీ (67; 44 బంతుల్లో 8×4, 3×6), షెఫాలి వర్మ (36; 32 బంతుల్లో 6×4) మెరుపు బ్యాటింగ్‌తో ఆ జట్టు త్వరగానే గెలిచేలా కనిపించింది. కానీ వారిద్దరు ఔటవడంతో విజయం కాస్త ఆలస్యమైంది. ఛేదనలో దిల్లీకి మెరుపు ఆరంభం లభించింది. ఓపెనర్లు లిజెలీ లీ, షెఫాలీ బౌలర్లను అసలు లెక్కే చేయలేదు. లిజెలీ ఓవర్‌కు ఒకట్రెండు ఫోర్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. ట్రయాన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. షెఫాలి చెలరేగడంతో 6.1 ఓవర్లలో దిల్లీ స్కోరు 50 దాటింది. లిజెలీ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించింది. ఓపెనర్ల జోరు చూస్తే 15 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేలా కనిపించింది. కానీ.. మూడు ఓవర్ల వ్యవధిలో షెఫాలి, లిజెలీ నిష్క్రమించడంతో పరుగుల వేగం తగ్గింది. వోల్వార్ట్ (25 నాటౌట్), జెమీమా (21) రాణించారు. త్వరగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో జెమీమా ఔటైంది.

జిల్లెల్లగూడ చందన చెరువు కట్ట వద్ద అగ్ని ప్రమాదం

ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

దశ, రంగారెడ్డి: హైదరాబాద్ కమిషనరేట్, మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చందన చెరువు కట్ట ప్రధాన రహదారి వద్ద శంషాబాద్ జోన్ బడంగ్పేట్ సర్కిల్ జిల్లెల్లగూడలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. చెరువు కట్ట చుట్టూ భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం, అలాగే కట్టకు ఇరువైపులా ఏర్పాటు చేసిన వ్యాపారాలు చెత్తను నిర్లక్ష్యంగా పారవేయడంతో ఒక్కసారిగా చెత్తలో భారీగా మంటలు చెలరేగాయి. మంటల సమీపంలోనే ఒక మెకానిక్ షెడ్‌తో పాటు పెద్ద మొత్తంలో పాత టైర్ల గోదాం ఉండటంతో, కొద్దిసేపు ఆలస్యం జరిగి ఉంటే భారీ అగ్ని ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సంఘటనను గమనించిన అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది నర్సింగ్ రావు, కృష్ణ, గణేష్, అశ్వక్ వెంటనే స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నం



చేయడంతో పాటు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ట్రాఫిక్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు కట్ట పరిసరాల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, శాశ్వత పరిష్కారాలు అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్ విక్టరీ

భారత్ న్యూజిలాండ్ మధ్య రాజ్‌కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమిపాలయింది. టాస్ ఓడిన శుభ్‌మన్ గిల్ సేన మ్యాచ్‌ను కూడా ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో కేఎల్ రాహుల్ సెంచరీ సాయంతో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. న్యూజిలాండ్ జట్టు మిచెల్ సెంచరీ చేయడంతో 47.3 ఓవర్లలోనే ఈ లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో వన్డేలో కివీస్ విజయం సాధించింది. టీమిండియా అంటేనే చెలరేగి ఆడే డారెల్ మిచెల్ మరోసారి రెచ్చిపోయి ఆడాడు. రాజ్‌కోట్ వన్డేలో సెంచరీ చేసి భారత్‌కు ఓటమిని మిగిల్చాడు. ఆరంభం నుంచి పట్టు సాధించిన న్యూజిలాండ్‌కు టాప్ ఆర్డర్ బ్యాటర్లు విల్ యంగ్, డారెల్ మిచెల్ అద్భుత భాగస్వామ్యం అందించి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1 1తో సమం అయింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన వన్డేలో టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ ఒక్కడే



సెంచరీతో రాణించడం.. రోహిత్, విరాట్ కోహ్లి తక్కువ పరుగులకే అవుటవ్వడంతో భారత్ భారీ స్కోర్ చేయలేకపోయింది. భారత్ నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా.. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విల్ యంగ్, డారెల్ మిచెల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. డెవాన్ కాన్వే 21 బంతుల్లో 16 పరుగులు చేయగా, హెన్రీ నికోలస్ 10 పరుగులు చేసి అవుటయ్యారు. 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయినప్పటికీ విల్ యంగ్ డారెల్ మిచెల్ 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

విల్ యంగ్ 98 బంతులు ఆడి 7 ఫోర్లతో 87 పరుగులు చేశాడు. సెంచరీకి అతి చేరువగా ఉన్న సమయంలో అనవసర షాట్లకు

ప్రయత్నించి చేజేతులారా వికెట్ కోల్పోయాడు. యంగ్ తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ దూకుడుగా ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. అదే సమయంలో డారెల్ మిచెల్ కూడా స్పీడు పెంచి పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలోనే మిచెల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

యంగ్ అవుటైన తర్వాత గ్లెన్ ఫిలిప్స్ మిచెల్ కలిసి వికెట్ పడకుండా 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ని ముగించారు. డారెల్ మిచెల్ 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 131 పరుగులు చేయగా, గ్లెన్ ఫిలిప్స్ 25 బంతుల్లో రెండు ఫోర్లు, 1 సిక్సర్‌తో 32 పరుగులు చేశాడు. దాంతో న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ గెలవగా, రెండో వన్డేలో న్యూజిలాండ్ విజయం సాధించింది. ఇండోర్ వేదికగా జనవరి 18న జరిగే మూడో వన్డే కీలకం కానుంది.

మహిళలను కించపరిస్తే దేశానికే నష్టం

మొదటి పేజీ తరువాయి

అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీపీ సజ్జనార్ చేసిన ట్వీట్ .. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇల్లుఉద్యోగం రెండింటినీ సమ తుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే. భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః'.. మహిళలకు గౌరవం ఉన్నచోటే సుభిక్షం ఉంటుంది. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరం. వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మహిళలను గౌరవించని సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టం. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

భర్త అప్పులు తీర్చేందుకు..

మొదటి పేజీ తరువాయి

సుమారు రూ. 5 లక్షల వరకు అప్పులు చేయడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. భర్త అప్పుల బాధతో కుంగిపోతుండటం చూసి ఎలాగైనా డబ్బు సంపాదించాలనే తప్పుడు ఆలోచనతో అనితా రెడ్డి దారి తప్పింది. నగరంలోని మియాపూర్‌కు చెందిన నల్ల కమల అనే వృద్ధురాలు సోమవారం సాయంత్రం అవంతినగర్ తోట కాలనీలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆమె పై అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కగా.. అప్పటికే అక్కడ కాపుకాసిన నిందితురాలు అనితా రెడ్డి చాకచక్యంగా లోపలికి ప్రవేశించింది. లిఫ్ట్ తలుపులు మూసుకోకముందే వృద్ధురాలి మెడలోని మంగళసూత్రం, నల్లపూసల గొలుసును తెంపేందుకు ప్రయత్నించింది. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అనితారెడ్డి చేతికందిన సుమారు అర తులం బరువున్న నల్లపూసల గొలుసును తెంచుకుని అక్కడి నుంచి పరారైంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సనత్‌నగర్ పోలీసులు కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీని నిశితంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితురాలిని అనితా రెడ్డిగా గుర్తించి చోరీ జరిగిన అరగంట వ్యవధిలోనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నత చదువులు చదివి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండాల్సిన మహిళ.. క్షణికావేశంలో చేసిన తప్పుకు ఇప్పుడు జైలు పాలవ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

గ్రామ పంచాయతీలకు సంక్రాంతి కానుక..

మొదటి పేజీ తరువాయి

నిధుల కొరత లేకుండా చూస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఈ విధంగా నెరవేర్చింది. పంచాయతీలకు విడుదల చేసిన ఈ నిధులు గ్రామాల్లోని పాలనను మరింత బలోపేతం చేయనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా.. గ్రామాల్లో మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్ల నిర్వహణ వంటి పనులకు ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పారిశుధ్య నిర్వహణలో భాగంగా.. పండుగ సీజన్ కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి, చెత్త సేకరణ వాహనాల నిర్వహణకు ఈ నిధులు ఉపయోగపడతాయి. గత కొన్ని నెలలుగా నిధులు లేక నిలిచిపోయిన చిన్న తరహా అభివృద్ధి పనులకు ఈ కేటాయింపులు ఊపిరి పోయనున్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేసి, ఈ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.

విషం ఇవ్వడంతో 600 కుక్కలు మృతి

మొదటి పేజీ తరువాయి

సర్పంచుల పర్యవేక్షణలో ఈ సామూహిక హత్య జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన జరిగిన తర్వాత, జంతు హక్కుల కార్యకర్తలు మూల రజని, అనపోలు అనిత, భాను ప్రకాష్, గోవర్ధన్, తదితరులు మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా, కుక్కలను పూడ్చిపెట్టారని ఆరోపణలు వచ్చిన ప్రదేశాలను గుర్తించి, పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై జంతు సంక్షేమ సంఘాలు మాట్లాడుతూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని , జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.